క్లుప్తంగా

నేటి నుంచి పాటల పోటీలు

సీటీఆర్‌ఐ: దానవాయిపేటలోని ఫణీంద్ర స్కానింగ్ సెంటర్ పైన గల ఎస్పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యాన శుక్ర, శని, ఆదివారాలలో దేశభక్తి, జానపద పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ అమీర్ గురువారం తెలిపారు. ఎస్పీఎస్ సంగీత విద్యాసంస్థ దశమ వార్షికోత్సవం, నూతన బ్రాంచి ప్రారంభోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ మూడు రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి గజిబిజి గపదని, రివర్స్ గేమ్ ఫేమ్ సోమ్లా నాయక్ (హైదరాబాద్) ఆధ్వర్యాన పోటీలు జరుగుతాయన్నారు. వీటిలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్ ఇస్తామని, ప్రతిభ చూపిన వారికి 11వ తేదీ సాయంత్రం జరిగే సంగీత విభావరిలో అవకాశం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 94414 48920 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా చెళ్లపిళ్ల జయంత్యుత్సవం

కడియం: తిరుపతి వెంకట కవులలో ఒకరైన చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి జయంతిని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి వెంకట కవుల విగ్రహాలకు కళాసేవాసమితి సభ్యులు పూలమాలలు వేశారు. సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టీవీ సత్యనారాయణ, డాక్టర్ దేవరపు నీలకంఠరావు, గొల్లపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కంబాలచెరువు: ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం ఫ్రీ సీట్ల కేటాయింపు జీవోను అమలు చేయని గౌతమి, విద్యాభవన్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఉచిత విద్య విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు కోటగుమ్మం సెంటర్‌లోని డీవైఈవో కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. కొమ్ము సత్తిబాబు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆర్‌టీఈ 12(1)సీ 2024.25 జీవోను అమలు చేయాలన్నారు. జీవో ప్రకారం ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని, కొన్ని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఈ జీవోను తుంగలో తొక్కి పేద విద్యార్థులతో ఫీజులు కట్టించుకుంటున్నాయన్నారు. గౌతమి స్కూల్లో 34 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించగా, ఆ యాజమాన్యం కేవలం 6 సీట్లు మాత్రమే ఇచ్చి మిగిలిన విద్యార్థులకు సీట్లు కేటాయించలేదన్నారు. దీనిపై కలెక్టర్ వేసిన కమిటీ సభ్యులు ఆ స్కూళ్లకు వెళ్లి విచారణ జరపకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	రాయన్
సూర్యమినీ	తుఫాన్
సూర్యప్యాలెస్	మురారి
స్వామి	శివంభజే
అశోక	కల్కి 2898ఏడి
శివజ్యోతి	సింబా
అనుశ్రీ	కమిటీ కుర్రోళ్లు
రంభ	సూపర్‌డీలక్స్
ఊర్వశి	తుఫాన్
మేనక	ల్యాండ్ మాఫియా, బడ్డీ
కుమారి	మురారి
అప్సర	భవనమ్
నామవరం	
వీఎస్ మహల్	కమిటీ కుర్రోళ్లు
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	కమిటీ కుర్రోళ్లు

వ్యవసాయం చేతికందేనా..!?

- వర్షాలతో నిండా మునిగిన రైతన్నలు
- సిద్ధమైన పంట నష్టం నివేదికలు
- ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలు



తొర్రేడులో నీట మునిగిన పొలాలను చూపుతున్న రైతులు



ముంపు వీడని వరి చేలు

రాజమహేంద్రవరం రూరల్: భారీ వర్షాలు, వరదల కారణంగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని రైతులు పీకల్లోతు కష్టాల్లో మునిగారు. వరిలో ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడులు పెట్టి, పంట కోసం ఎదురుచూస్తున్న తరుణంలో, ఈ వర్షాలు తీవ్ర నష్టాన్నే మిగిల్చాయి. మురుగు కాల్వల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రూరల్ నియోజకవర్గం పరిధిలోని రూరల్, కడియం మండలాల్లో అత్యధిక శాతం పొలాలు ముంపు బారిన పడ్డాయి.

కాతేరు జల్ల కాలువ, హుకుంపేట–ధవళేశ్వరం ఆవ కాలువల కారణంగా వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయని రైతులు వాపోయారు. అలాగే కడియం ఆవ ప్రాంతంలో సైతం మురుగు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతోనే ముంపు నీరు దిగువకు పారడం లేదంటున్నారు. రోజుల తరబడి వరి నాట్లు నీటిలో నానిపోవడంతో పలుచోట్ల తిరిగి నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికి కూడా కడియం ఆవ ప్రాంతంలోని పలుచోట్ల ముంపునీరు నిలిచి ఉంది. దీనితోడు లంక గ్రామాల పరిధిలో ఉద్యాన పంటలు సాగు చేసే భూములను కూడా గోదావరి వరదలు ముంచెత్తాయి. దీంతో కడియం మండలంలోని కడియపు లంక, పొట్టిలంక తదితర చోట్ల ఉద్యాన, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి.

రూరల్‌లో నష్టం తీరిలా..

రూరల్ మండలంలో మొత్తం 430 హెక్టార్లలో వరి పంట, 3.2 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు లెక్క తేల్చారు. అలాగే కడియం మండలం పరిధిలో 127 ఎకరాల్లో వరి, 11.2 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు సంబంధిత రైతుల వివరాలను వారు నమోదు చేశారు.

సాయం ఎప్పటికి అందేనో..?

తీవ్రంగా నష్టపోయిన రైతులు తమను ప్రభుత్వం ఆదుకుంటుందున్న ఆశతో ఎదురు చూస్తున్నారు. నష్ట నివేదికల రూపకల్పన, తుది జాబితా ప్రకటన తదితర ప్రక్రియలు ఇప్పటికే పూర్తయ్యాయి. అయితే నష్టం ఎప్పుడు అందిస్తారన్నది ప్రభుత్వం నుంచి కచ్చితమైన సమాచారం లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు నష్టం ఏర్పడితే, వెంటనే స్పందించి, పరిహారం అందించేవారని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

33 శాతం మించితేనే..

కాగా 33 శాతానికి మించి నష్టం ఏర్పడితేనే పంట నష్టంగా పరిగణిస్తారు. ఈ మేరకు రైతుల వివరాలను నమోదు చేసి సామాజిక ఆడిట్‌లో భాగంగా రైతు భరోసా కేంద్రాలు, సొసైటీలు తదితర చోట్ల ఏర్పాటు చేశారు. ఈ నెల 8లోగా రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. 12 నాటికి తుది జాబితాను సిద్ధం చేస్తారు. రైతుల అభ్యంతరాల మేరకు జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తారు.

యాక్సిడెంట్ కేసుల జాబితా అందించండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: జిల్లా కోర్టు ఆవరణలో గురువారం మోటారు వాహన ప్రమాద బాధితుల తరఫున జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులను పరిష్కరించేందుకు, బాధితులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం పెండింగ్‌లో ఉన్న మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులను గుర్తించి, ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. త్వరలో నిర్వహించనున్న ముందస్తు లోక్ అదాలత్ సమావేశాల్లో బీమా సంస్థలు, యాక్సిడెంట్ కేసుల్లోని బాధితులు, ఇరు పక్షాల న్యాయవాదులు పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, వివిధ బీమా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చిక్కులు తప్పేదెలా..



ట్రాఫిక్ సమస్యపై అధికారులతో చర్చిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ (ఫైల్)

- నగర వాసుల అవస్థలు
- ముఖ్యకూడళ్లలో విపరీతమైన రద్దీ
- ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో సమస్య జటిలం

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ట్రాఫిక్ చెరలో చిక్కుకుంది. నగరంలోని ఏమూలకు వెళ్లినా విపరీతమైన రద్దీ కనిపిస్తుంది. నిత్యం ఉదయం, సాయంత్రం వేళలో మరీ ఎక్కువగా ఉంటోంది. ఆ సమయంలో పది నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్యానికి అరగంట ఉంచి గంట వరకు పడుతోంది. ముఖ్యకూడళ్లలో వాహనదారుల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు.

కారణమేమిటంటే..

విపరీతంగా పెరిగిన జనాభా, వాహనాలు దీనికి కారణమైతే, నగరంలో ఫుట్‌పాత్‌లు, రోడ్లపై చోటుచేసుకున్న ఆక్రమణలు మరో కారణం. ఈ చిక్కుముడులు విప్పేందుకు నగరపాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. అయితే ఈ విషయంలో రెండు శాఖలకు కొంత సమన్వయ లోపం కనిపిస్తోంది. ఇరుశాఖలు కలిసి నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలి. ఆక్రమణల విషయంలో ఒత్తిళ్లకు తలొగ్గకుండా పని చేస్తే నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను చాలా వరకు పరిష్కరించవచ్చు.

కార్యాచరణ

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఆక్రమణలను తొలగించే దిశగా పోలీసులు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ శాఖాధికారులు ముందుకు వచ్చారు. దీనికి సంబంధించి నగర పాలక సంస్థ, పోలీసులు అధికారులు కలిసి నగరంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించనున్నారు. దీనికి సంబంధించి రూట్ మ్యాప్ సిద్ధం చేసి ఆక్రమణ తొలగింపులకు సంబంధించి సమగ్ర నివేదిక అందజేయాల్సి ఉంది.

తీవ్ర ఇబ్బందులు

నగరంలో ట్రాఫిక్ సమస్యను ఇప్పటి నుంచే పరిష్కరించకపోతే 2027లో జరిగే గోదావరి పుష్కరాల్లో మరింత జటిలమవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇరుశాఖల అధికారులు రంగంలోకి దిగాలి. పూర్తి సమన్వయంతో యాక్షన్ ప్లాన్ రూపొందించి ట్రాఫిక్ సమస్య లేకుండా నగరంగా తీర్చిదిద్దాలని నగరవాసులు కోరుకుంటున్నారు. అలాగే ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు అధికంగా ఉండడంతో వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో సమస్య మరింత పెరుగుతోంది.

నియంత్రణకు చర్యలు

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాం. ఇందుకోసం కార్పొరేషన్ అధికారులతో కలిసి పని చేస్తాం. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారిపైనా, వాహనాలను రోడ్లపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్న వారిపైనా కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తాం. నగరంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూస్తాం.

– డి.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ, రాజమహేంద్రవరం

మాజీ ఎంపీ భరత్‌రామ్ జోలికొస్తే ఊరుకోం

- కూటమి ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు తప్పదు
- వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కదలి వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని ఎంతో అభివృద్ధి చేసి, రోల్ మోడల్‌గా తీర్చిదిద్దిన మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌పై టీడీపీ నాయకులు విమర్శలు చేస్తే సహించబోమని వైఎస్సార్ సీపీ నాయకుడు కదలి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ తరువాత రాజమహేంద్రవరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇలాంటి చోట ప్రజాప్రతినిధులుగా పనిచేయడాన్ని అదృష్టంగా భావించాలన్నారు. వీలయితే భరత్ రామ్ చేసిన దానికంటే ఎక్కువ అభివృద్ధి చేసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వెనకడుగు వేసిందన్నారు. ఏదో కారణం చెప్పి కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఆరు నెలల్లో ఈ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు తప్పదని స్పష్టం చేశారు. మెడికల్ కళాశాలలో అవినీతి జరిగిపోయిందంటూ రాజకీయాలు చేయడం టీడీపీ మానుకోవాలని కోరారు. లాలాచెరువు సమీపంలో నిల్వ చేసిన ఇసుక కొండలను మండపేటకు చెందిన ఒక జనసేన నాయకుడు, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో దోచుకున్నారని ఆరోపించారు. బిల్డర్ చిన్నా మాట్లాడుతూ ఇసుక ఉచితమని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ రూ.13 వేల నుంచి రూ.18 వేల వరకూ అమ్ముకుంటున్నారని ధ్వజమెత్తారు. బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల వెనుక టీడీపీ నాయకులు ఉన్నారన్నారు. ఏపీఐడీసీ స్టేట్ మాజీ డైరెక్టర్ కానుబోయిన సాగర్ మాట్లాడుతూ టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

13 నుంచి ఇంటింటా జెండా పండగ

- ఇళ్లపై జాతీయ పతాకం ఎగురవేయాలి
- కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా వ్యాప్తంగా ఇంటింటా ఆగస్టు 13 నుంచి 15 వరకూ జెండా పండుగను నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. జెండా పండగ, జాతీయ ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జెండా పండగ సందర్భంగా ఆగస్టు 9 నుంచి 15 వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేస్తూ ర్యాలీలు జరపాలని తెలిపారు. ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా తిరంగా యాత్రలు, తిరంగా కచేరీలు, తిరంగా ప్రతిజ్ఞ, తిరంగా కాన్వాస్‌తో పాటు అనుమతించిన తిరంగా ప్రతి చోటా ప్రదర్శించాల్సి ఉందన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద చేతి, కులవృత్తులు చేసుకునే వారిని గుర్తించి పేర్లు నమోదు చేయాలన్నారు. కలెక్టర్ లాగిన్‌లో తిరస్కరించిన వాటిని తిరిగి నమోదు చేయడానికి అవకాశం లేదన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పశుగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో పర్యవేక్షణ విధానంలో పారదర్శకత, జవాబుదారీతనం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఏ.ముఖలింగం, డీపీవో డి.రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ బాలశంకరరావు, డీఆర్డీఏ పీడీ ఎంవీవీఎస్ మూర్తి, డివిజనల్ పంచాయతీ అధికారి నాగలత పాల్గొన్నారు.

భోజనం వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయి బాబా వసతి మందిరం ఆధ్వర్యంలో జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం నిరుపేదలకు దాతల సహకారంతో భోజనం ప్యాకెట్లు అందించారు. సీతానగరానికి చెందిన డేగల సూర్యకాంతం జ్ఞాపకార్థం, ఆమె కుమారుడు రాంబాబు ఆధ్వర్యంలో 150 మందికి పంపిణీ చేశారు.

పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు గురువారం జరిగాయి. మొత్తం 74 పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయినట్టు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం నాలుగు వరకూ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్ లను ఎన్నుకున్నారన్నారు. కమిటీ సభ్యులతో ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయించారన్నారు.

కడియం: మండలంలోని 9 ఉన్నత పాఠశాలలు, 40 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు పూర్తయ్యాయని ఎంఈవోలు వై.నాగేశ్వరరావు, ఎంఎస్ మణికుమార్ తెలిపారు. మాధవారయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్యనగర్ ప్రాథమిక పాఠశాల కమిటీకి మాత్రమే ఓటింగ్ జరిగిందని, మిగిలిన పాఠశాలలకు ఎన్నికలు ఏకగ్రీవంగానే జరిగాయన్నారు. కడియం హైస్కూలు చైర్మన్‌గా గారపాటి సత్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెం.1 ప్రాథమిక పాఠశాలకు కోటిపల్లి నాగ కిరణ్‌కుమారి, నెం.2కు నంబూరి సుజాత, నెంబర్ 3 స్కూల్‌కు సూరపురెడ్డి ఆంజనేయులు, నెం.4కు కలిదిండి సుబ్రహ్మణ్యం చైర్మన్లుగా ఎంపికయ్యారు. అనంతరం ఆయా పాఠశాలల్లో నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మురమండ హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా కాటే జ్యోతి బాయి, దుళ్ల ప్రాథమిక పాఠశాల 1 చైర్మన్‌గా ఆంధ్ర సత్యశ్రీనివాస్ కృష్ణమూర్తి ఎన్నికయ్యారు.

రూరల్ మండలంలో..

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని 52 ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన, సోషల్, బీసీ వెల్ఫేర్ ఉన్నత పాఠశాలలతో పాటు, ఒక ఎయిడెడ్ పాఠశాలలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. మెజార్టీ పాఠశాలల్లో కూటమి మద్దతుదారులే చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. రాజవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. పలు పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్ అభ్యర్థులు పసుపు చొక్కాలు ధరించి ఎన్నికలకు హాజరయ్యారు.

అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత



ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రంగంపేట: మహిళల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యతని ఐసీడీఎస్ సీడీపీఓ జె.జెస్సీఫ్లోరెన్స్ పేర్కొన్నారు. మనుషుల అక్రమ రవాణాపై ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉందన్నారు. రోజూ ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీనికి గురవుతున్నారన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ టి.శ్రావ్యశృతి మాట్లాడుతూ అక్రమ రవాణాను అరికట్టడంలో అందరూ భాగస్వాములు కావాలని, ప్రతి గ్రామంలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూప్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు శివ, అంబర్‌సింగ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నగరం.. జలమయం



దేవీచౌక్ నుంచి రామచంద్రరావుపేట వెళ్లే రోడ్డులో నీరు



కృష్ణానగర్ ఆదెమ్మదిబ్బ రోడ్డులో పరిస్థితి



హైటెక్ బస్సుషెల్టర్‌లోకి చేరిన నీరు

రాజమహేంద్రవరం సిటీ: వరుణుడు మళ్లీ తన ప్రతాపం చూపుతున్నాడు. నిన్నామొన్నటి వరకూ అధిక వర్షాలు, గోదావరి వరదతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. నాలుగు రోజులుగా కొంచెం తగ్గి సాధారణ పరిస్థితి ఏర్పడుతున్న సమయంలో గురువారం ఉదయం నగరంలో భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దేవీచౌక్ నుంచి రామచంద్రరావుపేట వెళ్లే రోడ్డులో మోకాలిలోతు నీరు నిలిచింది. కృష్ణానగర్‌లోని ఆదెమ్మ దిబ్బ ప్రాంతం ముంపు బారిన పడింది. కంబాలచెరువులోని హైటెక్ బస్ షెల్టర్ మునిగిపోయింది. రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఆగని రాజకీయ కక్షలు



బిక్కవోలులో కూల్చేసిన దుకాణాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్

బిక్కవోలు: అనపర్తి నియోజకవర్గంలో రాజకీయ కక్షలు ఆగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిక్కవోలు మండలం పందలపాకలో పేదలకు చెందిన వ్యాపార దుకాణాలు కూల్చేసిన ఘటన మరవకముందే గురువారం బిక్కవోలులో మరో రెండు దుకాణాలను నేలమట్టం చేశారు. బిక్కవోలుకు చెందిన సీడం ప్రకాష్, గరగా వెంకటరాజులకు చెందిన రెండు దుకాణాలను గురువారం కూల్చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించి తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సానుభూతి పరులన్న కారణంగా వారిపై ఎన్డీఏ నాయకులు రాజకీయ కక్ష తీర్చుకున్నారన్నారు. ప్రశాంతంగా ఉండే అనపర్తి నియోజకవర్గంలో దుష్ట సంస్కృతికి స్థానిక ఎన్డీఏ నాయకత్వం బీజం వేసిందన్నారు. రాజకీయాల్లో ఎప్పుడూ వాళ్లే శాశ్వతం కాదని అధికారం మారిన తర్వాత తమ పరిస్థితి ఏంటో కూడా వారు ఆలోచించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు మాత్రమేనన్నారు. సీడం ప్రకాష్‌కు చెందిన షాపు సుమారు వందేళ్లకు పూర్వం నుంచి ఉందని, గరగా వెంకటరాజుకు చెందిన షాపు సుమారు 20 ఏళ్ల క్రితమే ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఈ షాపులకు పంచాయతీ విధించిన పన్ను చెల్లించడంతో పాటు విద్యుత్ సర్వీస్ ఉందన్నారు.